సాగునీటికి భగీరథ యత్నం

- బోర్ల మీద బోర్లు తవ్విస్తున్న రైతన్న
- ఎండుతున్న పంటలు
- ట్యాంకర్ల సాయంతో నీరు పారిస్తున్న అన్నదాతలు

మాచారెడ్డి : ఒక వైపు మండుతున్న ఎండలు మరో వైపు భూగర్భ జలాలు తగ్గి పోవడంతో రైతులు ఎండుతున్న పంటలను కాపాడుకోవడానికి భగీరథ యత్నం చేస్తున్నారు. ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో నెల రోజులుగా దాదాపు 150 బోరు బావులు తవ్వించారు. అయినా నీరు పడక ఆశ చావక ఒక్కో రైతు అప్పులు జేసి రెండు నుంచి మూడు బోరు తవ్విస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో కొంత వరకు ఊరట కలిగినప్పటికీ మండుతున్న ఎండలతో ముఖ్యంగా నొట్లికొచ్చిన దశలో వరి పొలాలు బీటలు వారి పంట ఎండిపోతోంది. ఆరు గాలం శ్రమించి పండించిన పంటలు చేజారడంతో రైతన్నలు బావురుమంటున్నారు.

పశువులకు మేతగా..

మండుతున్న ఎండలు తోడు భూగర్భ జలాలు ఇంకిపోవడంతో వరి పంట ఎండి పోవడంతో రైతులు చేసేదేమీ లేక ఎండిన పంటను మూగ జీవాలతో మేపుతున్నారు. ఎండుతున్న పంటలను కాపాడుకోవడానికి బోర్ల మీద బోర్లు తవ్వించినా అవి వట్టి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి మాచారెడ్డి మండలంలో 23వేల 834ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అందులో 22వేల 493ఎకరాల్లో వరి, 302ఎకరాల్లో చెరకు, 1643ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సగానికి పైగా వరి పంట ఎండి పోయి పశువులకు మేతగా మారింది.ప్రభుత్వాలు స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఘన్‌పూర్‌లో ట్యాంకర్ సాయంతో పొలానికి నీరు పారిస్తున్న రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి..



నాకున్న 6ఎకరాల్లో వరి వేస్తే బోరులో నీరు అడుగంటి ఉన్న దంతా ఎండిపోయింది. మొత్తం పెట్టుబడి రు1.20లక్షలు నష్టం కలిగింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలి. లేదంటే ఆత్మ హత్యే శరణ్యం.

– రమావత్ శ్రీను, రైతు ఎల్పుగొండ, పాల్వంచ

పశువులను మేపుతున్నం..



మూడు ఎకరాల పొలంలో అ ప్పుచేసి వరి సాగు జేసిన బోర్ల నీళ్ళు ఎండిపోయి ఉన్న మూడెకరాల ఎండిపోయింది. చేసేదేమీ లేక పశువులను మేపుతున్నం ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలి.

– లంబాడి గోపాల్, రైతు, బ్రాహ్మణపల్లి తండా, మాచారెడ్డి

క్లుప్తంగా

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



భిక్కనూరు : మండలంలో నీటిఎద్దడి నివారణకు యుద్ధ ప్రాతిపాదికన చర్యలు చేపడుతున్నట్లు భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీన్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామాన్ని సందిర్శించారు. ఈ సందర్భంగా పలువురు తమ మంచినీటి కులాయిల్లో నీరు తక్కువగా వస్తుందని ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే స్పందించి నీరు తక్కువగా రావడానికి గ్రామంలో ఒక చోట పైపులైన్ ధ్వంసమైన విషయాన్ని గుర్తించి మరమ్మత్తులు చేయాలని ఆదేశించి వెంటనే పనులను ప్రారంభింపజేశారు. తదుపరి గ్రామంలోని మంచినీటి ట్యాంకును పరిశుభ్రం చేసిన విషయాన్ని తెలుసుకోవడానికి ట్యాంకు పైకి ఎక్కి పరిశీలించారు. వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్, జీపీ కార్యదర్శి తదితరులున్నారు.

3న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో మార్చి 3వ తేదీన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డీఈ గణేశ్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కార వేదికలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జిల్లా అధికారులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

రైతులకు రుణమాఫీ చేయాలి



నిజాంసాగర్(జుక్కల్) : రెండు లక్షల వరకు ఉన్న పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని కోరుతూ సొసైటీ మహాజన సభలో సభ్యులు, రైతులు తీర్మానం చేశారు. ఆదివారం మండలంలోని మల్లూర్ సొసైటీ మహాజన సభ చైర్మన్ ఒంటరి కల్యాణి అధ్యక్షతన నిర్వహించారు. పంటల సాగు కోసం తీసుకున్న రుణాలను ఒకేసారి మాఫీ చేసి, రైతులను ఆదుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో నాయకులు విఠల్‌రెడ్డి, బాబు సేట్, శ్రీనివాస్ సొసైటీ సీఈవో సాయిలు తదితరులు ఉన్నారు.

ప్రారంభం కాని క్రీడా ప్రాంగణం



నసరుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని లింగం పల్లి గ్రామంలో క్రీడా ప్రాంగణం ప్రారంభమే కాకుండా శిథిలం అయ్యిందనే చెప్పుకోవాలి. బోర్డు ఏర్పాటులో అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. క్రీడా ప్రాంగణం కోసం బోర్డును ఏర్పాటు కోసం గుంతలు తవ్వి అందులో బోర్డును వేసి గుంతలు పూడ్చకుండానే వదిలేశారు. మండల అధికారుల పనితీరును చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

సేంద్రియ ఎరువులపై రైతన్న ఆసక్తి



మద్నూర్(జుక్కల్) : ప్రస్తుతం రైతులు సేంద్రీయ ఎరువుల వైపు దృష్టి సారించారు. రైతులు దుక్కులు దున్నుకుంటున్నారు. దీనిలో భాగంగా పంట చేలల్లో భూసారాన్ని పెంచడానికి సహజ ఎరువులు, భూవులను సారవంతం చేయడానికి పశువుల పెంపకం దార్లను ఆశ్రయిస్తున్నారు. గొర్రె పెంపకం దార్లతో రైతులు ఒప్పందం చేసుకుని పంట చేలలో గొర్రె మందలను కూర్చోబెడుతున్నారు. అలాగే రైతుల వద్ద సహజ ఎరువులను ట్రాక్టర్లలతో, ఆటోలతో తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఆవులు, గేదెల ఎరువుకు రూ.1,900 తీసుకుంటున్నారని రైతులు పేర్కొన్నారు.

ఎంపీపీపై బలపరీక్ష

రామారెడ్డి : రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరత్ రెడ్డిపై సోమవారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస నోటీసులపై బలపరీక్ష నిర్వహించనున్నట్లుగా రామారెడ్డి ఎంపీడీవో సవిత తెలిపారు. కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్‌రావు అవిశ్వాసంపై బలపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ జయంతిని నిర్వహించాలి

పిట్లం(జుక్కల్): అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షుడు గైని విఠల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఆదివారం జుక్కల్ నియోజకవర్గస్థాయి అంబేడ్కర్ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. సోమవారం పిట్లం మార్కెట్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించే సమావేశానికి మండలం నుంచి 10మంది రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి గైని సురేష్, మండల అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రమేష్, ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గైని పోచయ్య, డివిజన్ కోశాధికారి గైని సాయికుమార్, సభ్యులు మద్దెల నవీన్, లక్ష్మణ్, ఎల్లన్న, గుంటి రాములు, గున్న సాయిలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నియోజకవర్గ అంబేడ్కర్ సంఘం సభ్యులు

పకడ్బందీగా వాహనాల తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేస్తున్నారు. ఆదివారం మండలంలోని వెల్గనూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు, ఎస్‌ఎస్‌టీ అధికారులు ప్రైవేట్ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై నుంచి వెళ్తున్న ప్రతీ ఒక్క ప్రైవేట్ వాహనాన్ని సోదాలు చేస్తున్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని అంజని గ్రామ చౌరస్తా జాతీయ రహదారిపై వాహనాల్లో నగదు, మద్యం తరలించకుండా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఏఎస్సై రాములు మాట్లాడుతూ రహదరిపై హైదారాబాద్ వైపు వెళ్లే వాహనాలను నిలిపి ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. పోలీస్ సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.



వెల్గనూర్ వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

సరిహద్దులో..

మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ వద్ద సరిహద్దులో జాతీయ రహదారిపై పోలీసులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణంగా తనిఖీలు చేస్తున్నారు. రూ. 50వేలకు పైగా తరలిస్తే సీజ్ చేస్తామని ఎస్సై శ్రీకాంత్ అన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిందం రాజయ్య, ఉపాధ్యక్షులుగా నల్లగంగారెడ్డి, కొర్రి అనిల్, కార్యదర్శిగా నర్సయ్య, కోషాధికారిగా నారాయణ, గ్రామ యూత్ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షునిగా సంపత్ అర్జున్, ప్రధానకార్యదర్శిగా పోసాని భరత్, కార్యదర్శిగా శ్యామ్‌ప్రసాద్, సోషల్ మీడియ ఇంచార్జీగా సతీశ్, బీసీ సెల్ ప్రధానకార్యదర్శిగా బాలక్రిష్ణ, ఎస్సీ సెల్ అధక్షునిగా రాజేందర్, ఎస్సీసెల్ ఉపాధ్యక్షునిగా కొమ్ము సాయిలు, సురేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంగారెడ్డి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, జగ్గ బాల్‌రాజు తదితరులున్నారు. మండలంలోని వజ్జపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గాదె చిన్నన్న, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, కార్యదర్శిగా ఒడ్డె గంగాధర్, సోషల్ మీడియా ఇంచార్జీగా కమలాకర్ రావులను ఎన్నుకున్నారు.



కమిటీ కార్యవర్గ సభ్యులు

సంక్షిప్తం

ఆర్యవైశ్య సంఘం సమావేశంలో రసాభాస

బాన్సువాడ : పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో రసాభాస చోటుచేసుకుంది. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పాత బాలకృష్ణ వ్యవహార శైలితో ఏకీభవించని పలువురు సభ్యులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. పరస్పరం భౌతికదాడులకు పాల్పడ్డారు. కాలనీవాసులు గొడవ విషయాన్ని బాన్సువాడ పోలీసులు తెల్పడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ప్రశాంత వాతావరణంలో మరోసారి సమావేశం పెట్టుకోవాలని సూచించి సభ్యులందరిని బయటకు పంపించేశారు.

బీఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడి రాజీనామా

బీబీపేట : మండలంలోని తుజాల్‌పూర్ బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడిగా ఉన్నటువంటి బూరెగారి రంజిత్ గౌడ్ ఆదివారం పార్టీ సభ్యత్వానికి, తన పదవికి రాజీనామా చేశారు. కొన్నేళ్లుగా బీఆర్‌ఎస్‌లో కష్టపడ్డప్పటికీ తగిన గుర్తింపు లేదని, పార్టీలో కొంత మంది వ్యక్తుల వల్ల పార్టీకి రాజీనామా చేశానని ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్ సమావేశానికి నాయకులు




బీబీపేట : కామారెడ్డిలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆదవారం మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, ఎంపీటీసీలు రవి, లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు రాజేశ్వర్‌రావు, సతీష్, నాగరాజుగౌడ్, బస్వరాజు తదితరులు బయలుదేరి వెళ్లారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



బీబీపేట : మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలకు కారణం మద్యం సేవించడమేనని ఎస్సై ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



బాన్సువాడ రూరల్ : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘాల జిల్లా అడిటర్ కరుణాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం పాతబాన్సువాడ సహకార సంఘం కార్యదర్శి నారాయణరెడ్డితో కలిసి కొల్లూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు జనార్ధన్ రెడ్డి, బాపురెడ్డి, గంగారెడ్డి, బర్లసాయిలు, గుండారాం సాయిలు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్4వ వతేదీన తాడ్వాయి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ కొడిరవి అధ్యక్షతనఈ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

ఆలయాభివృద్ధి విరాళం



మాచారెడ్డి : ఆలయ అభివృద్ధి కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దేశాయ్ పేట గ్రామానికి చెందిన ఇంద్రాల ముత్యంరావు, లక్ష్మీ దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగు పాము పుట్టపై షెడ్డు నిర్మాణం కోసం రూ.1.50లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు స్వామి వారి చిత్ర పటాన్ని బహూకరించి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి,ఈవో శ్రీధర్ రావు సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కామారెడ్డి టౌన్ : అవార్డీ టీచర్స్ అసోసియేషన్ కామారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంసింగ్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మనోహర్, మార బాల్ రెడ్డి, కోశాధికారి హరిప్రసాద్, ఉపాధ్యక్షులు మనోహర్ రావు, విష్ణువర్ధన్, కార్యదర్శి రామ్మోహన్ , నర్సింగ్ రావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు సన్మానం



కామారెడ్డి క్రైం : కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్లో గతేడాది నుండి విధులు నిర్వర్తించి ఆదివారం బదిలీపై నిజామాబాద్ కమిషనరేట్‌కు వెళ్తున్న ఏడు మంది హోంగార్డు అధికారులను కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు మండల విద్యార్థులు



శ్రీముద్



సాత్విక్ రావ్



రిశ్వేందర్‌రెడ్డి

రాజంపేట : నవోదయ ప్రవేశ పరీక్షలో మండలంలోని శివాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని వెల్మల రిశ్వేందర్‌రెడ్డి, నిట్టూరి సాత్విక్ రావ్, శ్రీముద్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ముదాం స్వామి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 80 విద్యార్థులు ఎంపిక కాగా శివాయిపల్లి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆనందం వ్యకం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రామస్వామి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మండుతున్న ఎండలు

మద్నూర్(జుక్కల్) : రోజుజోరుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల నుండే ఎండ దంచుతోంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో భగభగలాడుతుండడంతో బయటికి రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో విద్యుత్ కోతలతో ఫ్యాన్‌లు తిరగక, కూలర్లు పనిచేయక.. చెమటలు పట్టి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇక వృద్ధులు, పిల్లల పరిస్థితి దయనీయంగా మారుతుంది.

శీతల పానీయాలకు గిరాకీ..

మండే ఎండలు, వీచే వడ గాలుల నుంచి ఉపశమనాన్ని పొందెందుకు పట్టణవాసులు శీతల పానీయాల దుకాణాలకు చేరుకుంటున్నారు. వేసవి తాపం తీర్చే కొబ్బరిబోండాలు, పుచ్చకాయను ఎక్కువగా ఆదరిస్తున్నారు. సాయంత్రం కాగానే మండల కేంద్రంలోని పండ్ల రసాల దుకాణాల వద్ద జనం ఉంటున్నారు. దీంతో ఆ వ్యాపారుల గిరాకీ పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువకులు శివారులోని వ్యవసాయ బావుల్లో, కాలువలలో ఈత కోడుతు ఉపశమనం పోందుతున్నారు.



మద్నూర్‌లో బోసిపోయిన రోడ్డు

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి రూరల్ : ఆర్టీసీ బస్సు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని తమను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం కామారెడ్డి జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ వ్యవస్థాపకుడు, జిల్లా అధ్యక్షుడు బోదాస్ నర్సింలు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులు, జిల్లా నాయకులు గోల్కొండ రాజయ్య, సిద్ధరాములు, బీబీపేట స్వామి గౌడ్, హరే కృష్ణ, సిందే సాయిరాం, బాలజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు

భిక్కనూరు : మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో సిద్దరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హైకోర్టు న్యాయవాది పెద్ద బచ్చగారి రాంరెడ్డి-కృష్ణవేణి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో కుర్రి లింబాద్రి, కుర్రి నవీన్‌కు సంబంధించిన సొంత స్థలంలో ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణుడైన రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. తదుపరి సోమవారం నిర్వహించే సిద్ధ రామేశ్వరస్వామి–మాత భువనేశ్వరీ కల్యాణంనకు లక్ష్మీనృసింహస్వామిని ఆహ్వానిస్తూ స్వామివారి విగ్రహం వద్ద బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పత్రికను అక్కడ పెట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తున్కి వేణు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, లింబాద్రి, నీల అంజయ్య, దయాకర్ రెడ్డి, సుధర్శన్ తదితరులున్నారు.



లక్ష్మీనృసింహస్వామి విగ్రహానికి పూజ చేస్తున్న హైకోర్టు న్యాయవాది రాంరెడ్డి దంపతులు

ఆధ్యాత్మికం

కొనసాగుతున్న పంచముఖ లింగం ప్రతిష్ఠాపన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లి గ్రామంలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శివాలయంలో పంచముఖ లింగం ప్రతిష్ఠాపన కార్యక్రమం రెండోరోజు సాగింది. దీనిలో భాగంగా ఆదివారం గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఉపాసకులు మలమంచి గురురాజ శర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పట్లోళ్ల మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ, ట్రస్ట్ సభ్యులు వెంకట్రాం రెడ్డి, నందు రెడ్డి,పోతా రెడ్డి తదితరులున్నారు.

కొత్త పోశమ్మ మత్తడి పోశమ్మ ఆలయ ప్రతిష్ఠాపన



దోమకొండ : మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో కొత్త పోశమ్మ మత్తడి పోశమ్మ ఆలయాల పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అన్నదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు ఊరేగింపు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవాదల్ జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, మాజీ సర్పంచ్‌లు జూకంటి సంగారెడ్డి, యాదాగౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహాలకు ధాన్యాధివాసం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడివి లింగాలలో నల్లపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మవారి విగ్రహానికి ధాన్యాధివాసం చేశారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేకంగా పూజలు అభిషేకాల అనంతరం జలాధివాసం, ధాన్యాదివాసం చేశారు. సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని భిక్కనూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభం లేకపోవడంతో ప్రత్యేక పూజలను చేసి ఆలయం ఆవరణలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులు అమ్మవారికి కొబ్బరికాయులు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తిమ్మారెడ్డి తండాలో భోగ్ భండార్



ఎల్లారెడ్డి : మండలంలోని తిమ్మారెడ్డి తండాలో ఆదివారం సేవాలాల్ మందిరంలో భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో పొరాఘడ్ పీఠాధిపతి బాబుసింగ్ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అక్కాపూర్‌లో కుంకుమ పూజలు



మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్ లో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే ప్రధాన దేవతా హోమాన్ని వేదపండితులు ఘనంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. హోమంలో ఎంపీటీసీ బట్ట లత, ముత్యాల నర్సింహారెడ్డి, పొన్నాల మధు దంపతులు కూర్చున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొన్నాల లక్ష్మారెడ్డి, మోతుకు ఎల్లయ్య, పొన్నాల వెంకట్ రెడ్డి, బాల్ చంద్రం, గడ్డం బాబు ,గ్రామ పెద్దలు ఉన్నారు.